## లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి


కోర్టు కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీఐ కృష్ణ

రుద్రూర్, మే10: లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ కృష్ణ ఆయా పోలీసుస్టేషన్ల కానిస్టేబుళ్లకు సూచించారు. రుద్రూర్ సర్కిల్ పరిధిలోని కోర్టు కానిస్టేబుళ్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. రుద్రూర్, వర్ని, కోటగిరి పోలీసుస్టేషన్ల పరిధిలో పెండింగ్ ఉన్న కేసుల్లో బాధితులు లోక్ అదాలత్‌లో కేసులు రాజీ పడే విధంగా అవగాహన కల్పించాన్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఈత వనం దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఈత చెట్లు

రుద్రూర్, మే 10: మండలంలోని రాణంపల్లి శివారులో ప్రమాదవశాత్తుగా నిప్పు అంటుకొని శనివారం ఈత వనం దగ్ధమైంది. వ్యవసాయ భూమిలో ఎండు గడ్డికి పెట్టిన నిప్పు కాలుతూ.. ఈత వనానికి అంటుకున్నది. దీంతో సుమారు 40 ఈత చెట్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో తమ జీవనాధారం కోల్పోయామని గౌడ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు.

## భారత సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు

పొతంగల్, మే 10: భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని కోరుతూ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో శనివారం పలువురు నాయకులు వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సైనికులకు మద్దతుగా దేశ ప్రజలు ర్యాలీలు, ప్రత్యేక పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బజరంగ్ హన్మాండ్లు, గంగారాం, అశోక్, శంకర్, సాయిరాం, సాయిలు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

ధర్పల్లి, మే 10: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ధర్పల్లిలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వ చ్చిన రోగులకు డాక్టర్ శివశంకర్ ఆధ్వర్యం లో వైద్యులు, సిబ్బం ది సేవలు అందించా రు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. 38 మంది చిన్నారులు, ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలున్న 41మందికి, 37మంది సాధారణ రోగులను పరీక్షించి, అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ శివశంకర్, ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది భూలక్ష్మి, సృజన, మమత, మురళి, సంతోష్, వాజిద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

పొతంగల్, మే 10: చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన పొతంగల్ మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం(65) చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంజీరా నది వద్దకు వెళ్లి వెతకగా.. అక్కడ ఒడ్డుపై అతడి బట్టలు గుర్తించారు. అనంతరం మంజీరాలో మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు నీటిలో పడి వల కాళ్లకు చుట్టుకొని మృతిచెంది ఉంటాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సునీల్ తెలిపారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్, మే 10: దూపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌గంగారాం(60) అనే వ్యక్తి చెరువులోదూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై చంద్రమోహన్ శనివారం తెలిపారు. 20 ఏండ్లుగా మోకాలి నొప్పితో బాధ పడుతున్న గంగారాంకు అత్యవసరాలు తీర్చుకునేందుకు కష్టంగా మారింది. దీంతో జీవితంపై విరక్తి చెంది తన ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి మద్యం మత్తులో అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

మాక్లూర్, మే 10: మండలంలోని అమ్రాద్ శివారులోని ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన గుర్తు తెలియని మహిళ (60) శనివారం మృతిచెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే సెల్ నంబర్ 8712659846కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

## సెల్‌ఫోన్ల రికవరీ

వినాయక్‌నగర్/మోర్తాడ్/రెంజల్, మే 10: నగరంలోని రెండో ఠాణా పరిధిలో కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వాటిని రికవరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొత్తం ఆరు ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. వాటిని బాధితులకు నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ శనివారం అందజేశారని చెప్పారు. కమ్మర్‌పల్లి మండల పరిధిలో ఇటీవల చోరీకి గురైన రెండు మొబైల్ ఫోన్లను గుర్తించి వాటిని బాధితులకు ఎస్సై అనిల్‌రెడ్డి శనివారం అప్పగించారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో వార సంతలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సదరు వ్యక్తికి అప్పగించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. నవీపేట మండలం ఫత్తేనగర్‌కు చెందిన హజీఖాన్ సాటాపూర్ వార సంతలో కూర గాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. జేబులో నుంచి సెల్ ఫోన్ పోయింది. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంతలో వెతకగా ఓమహిళ కూరగాయల గంపలో దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST
★ I, JANGABOI BHOOMAIAH S/o. JANGABOI PEDDANNA R/o. H.No.1-110, Abbapoor (V), Navipet (M), Nizamabad (Dist) నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. E558985 గలది. బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 7780727213
NTZ-338655

FINANCIAL SERVICES
★ Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో ఏరిపారేయాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్

ఖలీల్‌వాడి, మే 10: దేశంలో ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం కూకటి వేళ్లతో ఏరిపారేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసినా.. తీవ్రవాదులు అలజడి సృష్టిస్తున్నారని, ప్రాణనష్టం కలిగిస్తున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తీవ్రవాదాన్ని తుద ముట్టించాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అప్పులు తెచ్చి పాలన కొనసాగిస్తున్నదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేస్తూ.. ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. సీపీఐ గ్రామ, మండల మహాసభలు మే, జూన్ నెలల్లో నిర్వహించాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య, రాజన్న, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆరె కటికలు రాజకీయంగా ఎదగాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆరె కటికె సంఘం రాష్ట్ర బాధ్యుడు

ఖలీల్‌వాడి, మే 10: ఆరె కటికలు ఐక్యంగా ఉంటూ.. రాజకీయాల్లో ఎదగాలని ఆరె కటిక ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ గౌలికార్ నర్సింగ రావు పిలుపునిచ్చారు. ఆరె కటిక సంఘం నగర కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం నూతన అధ్యక్షుడు జమాల్‌పూర్ రమేశ్ నాయకత్వంలో ఆరె కటికల అభివృద్ధి సాధ్యమని విశ్వాసం వ్యక్తంచేశారు. రాష్ట్ర నాయకులు రవిలాల్, మురళీధర్, జితేందర్, సంజయ్‌రాజ్ తదితరులు మాట్లాడారు. అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి న్యంతాబార్ అశోక్, కోశాధికారి మిర్యాల్‌కర్ ఓం ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు అంకార్ రాజారాం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు న్యామ్తబాద్ నాగోజి, నెహ్రూ, బియ్యకర్ బిల్లి, శంకర గాంధీ, మోహన్‌లాల్, మాజీ కార్పొరేటర్ శివచరణ్, జిల్లా అధ్యక్షుడు ఆంకార్ మహేశ్, శంకర్, పిల్లి శ్రీకాంత్, లక్ష్మణ్, రవి, ఆనంద్, శ్రీనివాస్, రాజేశ్, గణేశ్, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీ సంఘ కార్యవర్గ సభ్యులు

ఖలీల్‌వాడి, మే 10: నగరంలోని పద్మశాలీ సంఘం వినాయక్‌నగర్ 49వ తర్ప నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దీకొండ యాదగిరి మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు అంకం రాజేందర్, గజం సుదర్శన్, కోశాధికారి సుప్పాల వెంకటలక్ష్మణ్, ఇతర కార్యవర్గ సభ్యులతో పద్మశాలీ సంఘం నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూల్లం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్, పద్మజ్యోతి పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షులు బత్తు భూమయ్య, హన్మాండ్లు, కార్యనిర్వాహక కార్యదర్శి పాము రాకేశ్, సహాయ కార్యదర్శులు బొమ్మెర సాయన్న, పెంట నారాయణ, సభ్యులు కట్ట వరప్రసాద్, గడ్డం సురేశ్, ముఖ్య సలహాదారులు బత్తుల మురళి, రేగొండ మోహన్‌కుమార్, పెంట అంబదాస్, సభ్యులు అడిచర్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

వినాయక్‌నగర్, మే 10: అర్బన్‌లో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం అందజేశారు. మొత్తం 49మంది లబ్ధిదారులకు రూ.11లక్షల95వేల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యానికి లక్షల్లో ఖర్చు అయితే పది నుంచి 20శాతం నిధులే మంజూరు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## సమ్మె కరపత్రాల ఆవిష్కరణ

వర్ని/భీమ్‌గల్/శక్కర్‌నగర్, మే 10: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, ఆశ యూనియ న్ నాయకులు నాగమణి, రాధ, బాలమణి, కార్మికులు గంగారాం, స్వాతి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ చార్‌బాయ్ బీడీ సెంటర్‌లో కార్మికులతో కలిసి పోస్టర్లను టీయూసీఐ జిల్లా కార్యదర్శి రమేశ్ సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా నాయకులు కే.రాజేశ్వర్, చార్‌బాయ్ బీడీ ప్యాకర్స్ సత్యం, అమీర్, బాబా, లింగం తదితరులు పాల్గొన్నారు. ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బోధన్ డివిజన్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. బోధన్ పీఆర్టీయూ భవన్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో నాయకులు బండారు మల్లేశ్, శంకర్ గౌడ్, వరదయ్య, సీహెచ్‌వీ హన్మంత్‌రావు తదితరులు మాట్లాడారు. కేంద్ర అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సమ్మె నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుల పోశెట్టి, నాగేశ్వర్,టి. లాలు, జి . ప్రవీన్, గోపి పాల్గొన్నారు.

# రోడ్డు పైనే మేకల సంత

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

నవీపేట, మే 10: మండల కేంద్రంలో బాసర రోడ్డుపై ఆర్టీసీ బస్టాండ్ ఎదుట శనివారం మేకల సంతను నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు, వ్యాపారులకు తిప్పలు తప్పలేదు. ఈ సంత గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు సౌకార్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. పార్కింగ్‌తోపాటు మార్కెట్ నిర్వహణకు స్థలం కేటాయించాలని కోరుతున్నాప్పటికీ జీపీ సిబ్బందిలో చలనం కనిపించడం లేదని వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతకు, వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

**డీపీవోకు లేఖ రాశాం**

మార్కెట్‌కు అనువైన స్థలం కేటాయించేందుకు జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాశాను. మండల కేంద్రంలో రెండు చోట్ల మార్కెట్‌కు స్థలం ఎంపిక చేశాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– రవీందర్ నాయక్, జీపీ కార్యదర్శి నవీపేట


రోడ్డు పైనే మేకల సంత నిర్వహిస్తున్న వ్యాపారులు


బోధన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

## బోధన్‌లో జర్నలిస్టుల ఆందోళన

బోధన్, మే 10: 'సాక్షి' ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై ఏపీ పోలీసుల దాడి ఘటనను నిరసిస్తూ బోధన్ పట్టణంలోనా అంబేద్కర్ చౌరస్తాలో శనివారం జర్నలిస్టులు ఆందోళన చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన చేపట్టారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ భూపతికి డాక్టరేట్


భూపతి

మోర్తాడ్, మే 10: మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మగ్రిపల్లి భూపతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాపొందారు. ప్రొఫెసర్ రామకృష్ణ పర్యవేక్షణలో ఎవల్యూషన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ 1956–2014 విత్ స్పెషల్ రిఫరెన్స్ టు నిజామాబాద్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పట్టాను పొందడంతో ప్రిన్సిపాల్ పెద్దన్న, అధ్యాపకులు మగ్రిపల్లి భూపతిని అభినందించారు.

## నల్లమట్టి లారీ బోల్తా

నందిపేట్, మే 10: నందిపేట్ – నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై విజయ్‌నగర్ వద్ద నల్లమట్టి తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. నల్లమట్టి ఓవర్‌లోడ్‌తో ఉండడంతో పాటు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. లారీలో ఉన్న మట్టి రోడ్డుపై పడిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చేరుకుని లారీలోని మట్టిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నందిపేట్‌లో బోల్తా పడిన నల్లమట్టి లారీ

# వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


నందిపేట్‌లో మాట్లాడుతున్న ఎంఈవో గంగాధర్


జక్రాన్‌పల్లిలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్/ వేల్పూర్/ బాల్కొండ/ నందిపేట్/ శక్కర్‌నగర్/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి, మే 10: మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 24 వరకు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు కోరారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ శిబిరాలను వారు శనివారం ప్రారంభించారు. వేసవిశిక్షణ శిబిరాలను మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలకేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో మండల విద్యాధికారులు సమ్మిరెడ్డి, ఆంధ్రయ్య ప్రారంభించారు. కమ్మర్‌పల్లిలో 90మంది విద్యార్థులు, మోర్తాడ్‌లో 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి స్నాక్స్ అందించి నేర్పించాల్సిన వివిధ కార్యక్రమాలపై ఎంఈవోలు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సాయన్న, నరేశ్, మనీషా, సరస్వతి, పురుషోత్తం, శ్రీనివాస్, శివాని పాల్గొన్నారు.

వేల్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో వేసవి శిక్షణ తరగతులను ఎంఈవో రేణుక ప్రారంభించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్‌పై ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాల్కొండ జడ్పీహెచ్‌ఎస్‌లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్, డ్రాయింగ్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు 71 మంది హాజరయ్యారని 100 మంది విద్యార్థుల నమోదుకు అవకాశం ఉందని తెలిపారు.

నందిపేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సంగీత, నృత్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు ఎంఈవో ఏ.గంగాధర్ తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. శిక్షకులు శ్వేత, చిన్నయ్యను అభినందించారు. హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బోధన్ పట్టణం, మండలానికి చెందిన 6 నుంచి 10 వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎంఈవో నాగయ్య సూచించారు.

బోధన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంగీతం, నృత్యం, కరాటే, ఆర్ట్స్ క్రాఫ్ట్స్, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ కొనసాగుతున్నదని ఆయన వెల్లడించారు. సంగీతంలో ఉపాధ్యాయురాలు సంగీత, చేతి రైటింగ్ స్కిల్స్‌పై ఉపాధ్యాయుడు చంద్రప్రకాశ్, డ్రాయింగ్‌లో ఉపాధ్యాయురాలు అవంతి, కరాటేను మాస్టర్ అశోక్ కుమార్ రోడే ద్వారా, డాన్స్ శ్రీకాంత్ మాస్టర్ ద్వారా నేర్పిస్తారని, ఎంఈవో తెలిపారు. ఉపాధ్యాయులు ఖైరాన్, సాయిలు, సీఆర్పీలు, పాల్గొన్నారు.

రెంజల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను ఎంఈవో ఆంజనేయులు ప్రారంభించారు. 8 నుంచి 14 ఏండ్ల మధ్య వయస్సు కల్గిన విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల సామలింగంగౌడ్, కిశోర్, వివిధ గ్రామాల విద్యార్థులు హాజరయ్యారు.

జక్రాన్‌పల్లి మండలంలోని జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో వేసవికాలం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. నృత్యం, చిత్రలేఖనం, కరాటే, యోగా, కంప్యూటర్‌లో 15 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన సామగ్రి, అల్పాహారం అందజేస్తారన్నారు. హెచ్‌ఎంలు లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మామిడి గోపి, ఉపాధ్యాయులు అశోక్, ముత్యంరెడ్డి, రాజు, సత్యనారాయణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి జడ్పీహెచ్‌ఎస్‌లో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో శ్రీధర్ ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రిక అందజేత


ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందిపేట్, మే 10: మండల కేంద్రంలో మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీరాంనగర్ భవ్య రామ మందిర సీతారామ లక్ష్మణ, ఆంజనేయ సమేత విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈనెల 14 నుంచి 16 వరకు హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామిచేత నిర్వహించనున్నట్లు పురోహితులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ఏలేటి అన్నపూర్ణమ్మకు ఆహ్వాన పత్రాలను హైదరాబాద్‌లో అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు రమణారెడ్డి, సాయన్న, మచ్చర్ల సాగర్ పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

రుద్రూర్, మే 10: రుద్రూర్‌తో పాటు రాణంపల్లి గ్రామంలోని పశువులకు శనివారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యుడు సంతోష్ మా ట్లాడుతూ.. పశువులకు ఉచితంగా వేసే గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమా న్ని పాడి రైతులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. రాణంపల్లి, రుద్రూర్ గ్రామాల్లో మొత్తం 190 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు.

## 'ఆర్మీ పేరిట విరాళాలు' అంటూ మోసం

భీమ్‌గల్, మే 10: ఆర్మీ ఆధునికీకరణ విరాళాలు అంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని భీమ్‌గల్ ఎస్సై మహేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైనిక సహాయ నిధి కోసం డొనేషన్ పేరిట ఫేక్ వెబ్‌సైట్లు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లింక్‌లు షేర్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇండియన్ ఆర్మీకోసం విరాళాలూ సేకరించడంలేదని పేర్కొన్నారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. అటువంటివి కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

## ప్రభుత్వ దవాఖానల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

వర్ని, మే 10: ప్రభుత్వ దవాఖానల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నూతన కమిటీని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా దేవీసింగ్, కోశాధికారిగా సావేష్, ఉపాధ్యక్షులుగా గంగాధర్, మంజుల, సహాయ కార్యదర్శులుగా నర్సింగ్, మాధవి, కార్యవర్గ సభ్యులుగా చింటు, దీపక్, సుమంత్, మాధవీలత, విశాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కమిటీ సభ్యులు అలుపెరగని పోరాటం చేయాలని నన్నేసాబ్ సూచించారు.

## బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

ఆర్మూర్‌టౌన్, మే10: ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్ కాలనీకి చెందిన నందు అనారోగ్యంతో బాధపడుతూ సర్జరీ కోసం దవాఖానలో చేరాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2లక్షల 50వేల విలువైన ఎల్వోసీ మంజూరు చేయించారు. శనివారం మాజీ కౌన్సిలర్ బాధితులకు ఎల్వోసీ కాపీని అందజేశారు.